సాక్షి నాగర్‌కర్నూల్

బుధవారం । 23 । అక్టోబర్ । 2024



నిధుల దుర్వినియోగం?

పీయూలో నిధులు దుర్వినియోగం అయినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

వివరాలు 8లో ▸



తగ్గిన ఇన్‌ఫ్లో

జూరాల జలాశయానికి వరద తగ్గుముఖం పట్టడంతో క్రస్ట్ గేట్లు అన్నీ మూసివేశారు.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
36.7 /20.9

వాతావరణం

రోజంతా ఆకాశం నిర్మానుష్యంగా ఉంటుంది. అప్పుడప్పుడు మేఘావృతమై ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

వెల్దండ: మండల పరిధిలోని గుండాల వద్ద ఉన్న తెలంగాణ ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో ఔట్‌సోర్సింగ్ పద్ధతిన సిబ్బంది నియామకానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రాంతీయ సమన్వయ అధికారి కళ్యాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వార్డెన్ (మహిళ), అసిస్టెంట్ కుక్, బోధనేతర సిబ్బంది ఖాళీలున్నాయని.. ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 30 వరకు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు సెల్‌నంబర్లు 97042 44232, 98857 38387 సంప్రదించాలని సూచించారు.

'ఇచ్చిన హామీలు నెరవేర్చాలి'



అచ్చంపేట: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు కోరారు. మంగళవారం పట్టణంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ పాలనలో మైలారం మైనింగ్ నిలిపివేస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం తవ్వకాలు జరుపుతూ రూ.వేల కోట్లు దోచుకుంటుందని ఆరోపించారు. తవ్వకాలకు వ్యతిరేకంగా గ్రామస్తులు ధర్నాలు చేస్తే అక్రమ కేసులు పెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అమ్రాబాద్ మండలం లక్ష్మాపూర్ లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ఎమ్మెల్యే ప్రధాన అనుచరుడు గుప్తనిధులు తవ్వి అడ్డంగా దొరికితే నేటి వరకు చర్యలు ఎందుకు తీసుకోలేదన్నారు. నల్లమల బిడ్డనని పదేపదే చెప్పుకొనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొండగల్‌కు రూ.4 వేల కోట్లు కేటాయించి.. ఈ ప్రాంతాన్ని విస్మరించారని ఆరోపించారు. నాయకులు, కార్యకర్తలు ఎవరూ అధైర్యపడొద్దని, అండగా ఉంటామని స్థానిక ఎన్నికల్లో బీఆర్‌ఎస్ సత్తా చాటుద్దామన్నారు. అక్రమ మైనింగ్, ఇసుక దందాతో ఎమ్మెల్యే రూ.కోట్లకు పడగెత్తారని, ఎన్నికల ముందు చందాలతో ఇళ్లు కట్టారని ఆరోపించారు. మాజీ మున్సిపల్ చైర్మన్ ఎడ్ల నర్సింహగౌడ్, కౌన్సిలర్ రమేష్‌రావు, సింగిల్ విండో చైర్మన్ నర్సయ్యయాదవ్, సీనియర్ నాయకులు అమీనోద్దీన్, కేటీ తిరుపతయ్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రాంబాబునాయక్, రవీందర్‌రావు, శంకర్ మాదిగ, ఖలీల్, సురేష్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు గురుకుల విద్యార్థి



వరప్రసాద్

లింగాల: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న వరప్రసాద్ రాష్ట్రస్థాయి అండర్-17 పోటీలకు ఎంపికయ్యారని పీడీ వెంకటేశ్వర్లు మంగళవారం తెలిపారు. అడ్డాకుల మండలం వేములలో ఈ నెల 21న జరిగిన జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ పోటీల్లో ప్రతిభ కనబర్చారని.. ఈ నెల 27 నుంచి 29 వరకు పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో జరిగే పోటీల్లో పాల్గొంటారని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థిని ప్రిన్సిపల్ బాలస్వామి, అధ్యాపక బృందం అభినందించింది.

రేపు బీచుపల్లిలో సీతారాముల కల్యాణం



ఎర్రవల్లి: బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని కోదండ రామస్వామి ఆలయంలో పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకొని గురువారం ఉదయం 10-00 గంటలకు సీతారాముల కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ మేనేజర్ సురేందర్ రాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై కల్యాణ వేడుకను కనులారా తిలకించి స్వామివారి కృపకు పాత్రులు కాగలరని ఆయన కోరారు.

నేడు ఎంవీఎస్‌లో జాతీయ సెమినార్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లాకేంద్రంలోని ఎంవీఎస్ డిగ్రీ కళాశాల తెలుగు డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో జాతీయ సెమినార్‌ను నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పద్మావతి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమంలో పీయూతో పాటు ఇతర యూనివర్సిటీ అధికారులు పాల్గొంటారని, విద్యార్థులు, అధ్యాపకులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఇసుకాసుర హస్తం..!



■ నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గంలోని ఉప్పునుంతల, వంగూరు మండలాల పరిధిలో దుందుభి వాగు పరిసరాల్లో ఇసుకను తోడేస్తున్నారు. మొల్గర, పెద్దాపూర్, దాసర్లపల్లిలో నిల్వ చేసిన డంప్‌ల నుంచి ఇసుకను అటు అచ్చంపేట, ఇటు తెలకపల్లి, నాగర్‌కర్నూల్‌కు ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. వంగూరు మండలంలో పోతిరెడ్డిపల్లి, ఉల్పర, మిట్టసదాగోడు, చింతపల్లి ద్వారా కల్వకుర్తి మీదుగా హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతాలకు టిప్పర్లు, బెంజ్‌ల ద్వారా ఇసుకను తరలిస్తున్నారు. ప్రస్తుతం వాగు ప్రవహిస్తుండడంతో ఇటీవలే తవ్వకాలు నిలిపివేశారు. ఈ ప్రాంతంలో ఒక పెద్ద డంప్ మాత్రమే మిగిలింది. ఆరోపణలు వెల్లువెత్తగా అధికారులు సందర్శించిన క్రమంలో అక్రమార్కులు ఆ డంప్‌ను వదిలేసి.. మిగతా మొత్తం డంప్‌లను ఖాళీ చేశారు. అచ్చంపేట నియోజకవర్గానికి చెందిన ముఖ్య నేత కనుసన్నల్లోనే ఈ ఇసుక దందా కొనసాగుతున్నట్లు తెలుస్తోంది.



■ మహబూబ్‌నగర్ జిల్లా, నారాయణపేట నియోజకవర్గ పరిధిలోని కోయిల్‌కొండ మండలంలోని అంకిళ్లవాగులో ఇసుక దందా కొనసాగుతోంది. ఎలాంటి అనుమతులు తీసుకోకుండా వారం, పది రోజుల నుంచి జేసీబీ, హిటాచీ వంటి భారీ యంత్రాలతో బ్రిడ్జి పక్క ఇసుకను తోడేస్తున్నారు. వందలాదిగా టిప్పర్లు, భారత్ బెంజ్ వంటి వాహనాల్లో వివిధ ప్రాంతాలకు తరలిస్తున్నారు.

■ కోయిల్‌కొండ, రాకొండలో ఇసుక దందా వెనుక నారాయణ పేట జిల్లాకు చెందిన ఓ ప్రజాప్రతినిధి కుటుంబ సభ్యుడి హస్తం ఉన్నట్లు సమాచారం.

■ నారాయణపేట జిల్లా మరికల్ మండలం రాకొండ గ్రామ సమీపంలోని వాగు నుంచి అధికార పార్టీకి చెందిన స్థానిక నేతలు ఇసుక దందా కొనసాగిస్తున్నారు. అనుమతులేకుండా ఇసుకను తోడేస్తున్నా.. అధికార యంత్రాంగం పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



రాత్రివేళ తుంగభద్ర నది నుంచి తీసుకొచ్చి గద్వాల రెండో రైల్వే గేట్ సమీపంలో డంప్ చేస్తున్న ఇసుక

■ జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గంలోని రాజోళి వద్ద తుంగభద్ర నది నుంచి ఇసుక అక్రమ రవాణా పెద్ద ఎత్తున జరుగుతోంది. దీని వెనుక అధికార పార్టీకి చెందిన ముఖ్య నాయకులు మొదలుకుని.. రెవెన్యూ, పోలీస్, మైనింగ్ శాఖల అధికారుల హస్తం ఉన్నట్లు ప్రచారం జోరుగా సాగుతోంది.

సాక్షి ఫోకస్

■ మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గంలోని చిన్నచింతకుంట మండలంలో ఊక చెట్టు వాగు నుంచి ఇసుకను తోడేస్తున్నారు. ఆ నియోజకవర్గ ముఖ్యనేత అండతో ఆయన వర్గీయులు రాత్రిళ్లు ఈ దందా నిర్వహిస్తున్నారు. ఉమ్మడి జిల్లాతో పాటు హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతాలకు భారీ వాహనాల్లో ఇసుకను తరలిస్తున్నారు. ముఖ్య నేత ఆదేశాలతో పోలీసులు, రెవెన్యూ అధికారులు కిమ్మనడం లేదని.. వాహనానికో రేటు చొప్పున ముడుపులు అందుతుండడంతో వారు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఉమ్మడి జిల్లాలో అనధికారికంగా ఇసుక దందా యథేచ్ఛగా సాగుతోందనడానికి ఈ ఉదాహరణలే నిదర్శనం. ఇవి మచ్చుకు మాత్రమే కాగా.. అధికారమే హద్దుగా వివిధ ప్రాంతాల్లో కాంగ్రెస్ ద్వితీయ శ్రేణి నాయకుల ఆధ్వర్యంలో ఇసుక తవ్వకాలు, రవాణా సాగుతోంది. ఆయా నియోజకవర్గాల్లో ముఖ్య నేతల అండతో పగలు, రాత్రిళ్లు అనే తేడా లేకుండా దందా నిరాటంకంగా కొనసాగుతున్నట్లు స్పష్టమవుతోంది. అయినా రెవెన్యూ, పోలీస్, మైనింగ్ యంత్రాంగం కిమ్మనకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కీలక నేతల ఒత్తిళ్లు.. నెలనెలకూ ఇసుక మాఫియా నుంచి అందుతున్న ఆమ్యామ్యాల నేపథ్యంలో ఆయా ప్రభుత్వ శాఖల అధికారులు తూతూమంత్రపు చర్యలతోనే సరిపెడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. - సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్

'అధికార'మే హద్దుగా అనధికారికంగా ఇసుక దందా

- ద్వితీయ శ్రేణి నాయకుల ఆధ్వర్యంలో తవ్వకాలు
- ముఖ్య నేతల అండతో పగలు, రాత్రిళ్లూ యథేచ్ఛగా రవాణా
- ఆమ్యామ్యాలతో పట్టించుకోని పోలీస్, రెవెన్యూ, మైనింగ్ యంత్రాంగం?
- సర్కారు ఆదాయానికి భారీగా గండి.. అడుగంటుతున్న భూగర్భ జలాలు



ట్రాక్టర్‌లో ఇసుకను నింపుతున్న కూలీలు

ఎక్కడెక్కడ అంటే..

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అనధికార ఇసుక దందా నిరాటంకంగా కొనసాగుతోంది. మహబూబ్‌నగర్ జిల్లాలో కోయిల్‌కొండ, సీసీకుంట, దేవరకద్ర, నవాబుపేట, మూసాపేట, పోల్కంపల్లితో పాటు నారాయణపేట జిల్లా మరికల్ మండలం రాకొండ, మక్తల్ మండలం దాసరిదొడ్డి, మాగనూరు.. నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంత, వంగూరు మండలం, జోగుళాంబ గద్వాల జిల్లా రాజోలి మండలం.. వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం తదితర మండలాల్లో ఇసుక తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. ప్రధానంగా అధికార పార్టీకి చెందిన ద్వితీయ శ్రేణి నాయకులే ఈ దందాలో కీలకంగా వ్యవహరిస్తున్నారు.

వాహనానికి ఓ రేటు చొప్పన..

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రస్తుతం మార్కెట్‌లో వాగు ఇసుక టిప్పర్‌కు రూ.30 వేల నుంచి రూ.34 వేలు, బెంజ్‌కు అయితే రూ.45 వేల నుంచి రూ.50 వేల వరకు ధర పలుకుతోంది. ట్రాక్టర్‌కు రూ.6 వేల నుంచి రూ.7,500 వసూలు చేస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో అక్రమార్కులు తరలిస్తున్న ఇసుకకు సంబంధించి ట్రాక్టర్‌కు అయితే పోలీస్, రెవెన్యూ సిబ్బందికి కలిపి రూ.2 వేల నుంచి రూ.3 వేల చొప్పున.. టిప్పర్‌కు రూ.4 వేల నుంచి రూ.4,500 చొప్పున, భారత్ బెంజ్‌కు రూ.5 వేల నుంచి రూ.5,500 చొప్పున ముడుపులు అందుతున్నట్లు సమాచారం. ఇదేవిధంగా దందాలో కీలకంగా వ్యవహరిస్తున్న అధికార పార్టీ ద్వితీయ శ్రేణి నాయకులకు వాహనాల సంఖ్య ప్రకారం రోజు వారీ చొప్పున పెద్ద మొత్తంలో అందుతున్నట్లు సమాచారం.



కోయిల్‌కొండ పెద్దవాగు నుంచి బెంజ్ వాహనంలో ఇసుక తరలిస్తున్న దృశ్యం

సర్కారు ఆదాయానికి గండి..

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అడ్డూ అదుపు లేకుండా కొనసాగుతున్న ఇసుక తవ్వకాలతో వాగులు, వంకలు వట్టిపోయి భూగర్భజలాలు అడుగంటుతున్నాయి. వాగులు, చెరువుల ఆయకట్టు పరిధిలోని రైతులు మొత్తుకుంటున్నా.. ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడడం లేదు. ఒకవైపు అనుమతుల్లేకుండా అనధికారికంగా తోడేస్తుండగా.. అభివృద్ధి పనులకు అనుమతుల పేరిట నిబంధనలకు పాతరేసి తవ్వకాలు చేస్తూ, రెట్టింపు సంఖ్యలో వాహనాల ద్వారా తరలిస్తుండడంతో సర్కారు ఆదాయానికి గండిపడుతోంది. అయినా రెవెన్యూ, పోలీస్, మైనింగ్, భూగర్భ జలవనరుల శాఖ యంత్రాంగం పట్టించుకోకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాగా, ఇసుక దందాకు సంబంధించి ఆయా శాఖలకు చెందిన పలువురు అధికారులను 'సాక్షి' సంప్రదించగా.. 'ఇసుక అక్రమ తవ్వకాలపై నిఘా పెడతాం. దందాకు సహకరిస్తున్న ప్రభుత్వ అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకుంటాం.' అని సమాధానమిచ్చారు.

ఉపాధి కల్పనకే నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు



మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు.. చిత్రంలో ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, కలెక్టర్లు బదావత్ సంతోష్, ఆదర్శ్ సురభి, ఎమ్మెల్యేలు రాజేశ్‌రెడ్డి, వంశీకృష్ణ, కసిరెడ్డి నారాయణరెడ్డి, తూడి మేఘారెడ్డి

- యువత ఉద్యోగ అవకాశాలు కల్పించే స్థాయికి ఎదగాలి
- రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

నాగర్‌కర్నూల్: యువత ప్రభుత్వ ఉద్యోగ సాధనకు పోటీ పడుతూనే.. పరిశ్రమలు నెలకొల్పి మరో పదిమందికి ఉద్యోగ అవకాశాలు కల్పించే స్థాయికి ఎదగాలని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆకాంక్షించారు. మంగళవారం నాగర్‌కర్నూల్‌లోని ఓ కన్వెన్షన్ హాల్‌లో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలపై నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయనతో పాటు ఎంపీ మల్లు రవి, నాగర్‌కర్నూల్, వనపర్తి కలెక్టర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రతి నియోజకవర్గంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలతో పాటు యువతకు ఉద్యోగ కల్పనపై అవగాహన కల్పించేందుకు రూ.50 లక్షలతో నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కలెక్టరేట్లలో ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ప్రైవేట్‌రంగంలో యువతకు అవకాశాలు, నైపుణ్య శిక్షణపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగా లేనప్పటికీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 50 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశారన్నారు. ఎంపీ డా. మల్లు రవి మాట్లాడుతూ.. పార్లమెంట్ పరిధిలోని బడుగు బలహీనవర్గాల యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్న ఉద్దేశంతో దేశంలోని వివిధ ప్రముఖ ప్రభుత్వరంగ సంస్థల ప్రతినిధులతో పాటు స్థానిక ఎన్జీఓ సంస్థ అవార్డు సహకారంతో అవగాహన సదస్సు నిర్వహించినట్లు తెలిపారు. స్థానిక యువతకు రుణాలు ఇప్పించే ప్రక్రియను వేగవంతం చేసేలా వివిధ బ్యాంకుల చైర్మన్లతో మాట్లాడి ఒప్పించామన్నారు. పార్లమెంట్ పరిధిలో మధ్య, భారీతరహా పరిశ్రమల ఏర్పాటుకు ప్రయత్నాలు చేస్తున్నామని, కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ ఫండ్ ద్వారా నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఏడు స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలు, ఎస్సీ, ఎస్టీ హబ్ సెల్‌లు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. పోలీసు, ఆర్మీ ఉద్యోగాల కొరకు శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. యువతను వ్యాపారవేత్తలుగా మార్చేందుకు మూడు జిల్లాల కలెక్టర్లు సహకరించాలని కోరారు. నెల తర్వాత డీసీసీబీ ఆధ్వర్యంలో రూ.150 కోట్లతో నాగర్‌కర్నూల్‌లో రుణమేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. శాసనమండలి సభ్యుడు కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ.. యువత పారిశ్రామికవేత్తలుగా రాణించి పది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే స్థాయికి ఎదగాలని కోరారు. డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. బ్యాంకు ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు చేపడతామని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తోందని, సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అవగాహన అవసరం..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలు, అందించే రుణాలు, రాయితీలపై బ్యాంకు ప్రతినిధులు యువతకు అవగాహన కల్పించాలని నాగర్‌కర్నూల్ కలెక్టర్ బాదావత్ సంతోష్ సూచించారు. యువత వ్యాపారవేత్తలుగా మారడానికి కావాల్సిన సహకారం అందిస్తామని తెలిపారు.

ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి మాట్లాడుతూ.. దేశంలోనే మొదటిసారిగా యువతకు అవగాహన సదస్సు నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మల్లు రవికి కృతజ్ఞతలు తెలిపారు. అచ్చంపేట ఎమ్మెల్యే డా. వంశీకృష్ణ మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్న తపనతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలతో పాటు ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతకు అండగా ఉంటుందని చెప్పారు. వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మాట్లాడుతూ.. తాను డిగ్రీ అనంతరం పారిశ్రామికరంగంలో రాణించి 600 మందికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. నిర్మాణ రంగంలో రాష్ట్రంలోనే కాకుండా ఇతర ప్రాంతాల్లో కూడా తన సంస్థ ఎంతో ఉన్నతంగా కొనసాగుతుందని.. యువతకు తాను ఒక ఉదాహరణగా నిలుస్తానని చెప్పారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ.. నేటి యువత ప్రభుత్వ ఉద్యోగాలకు మాత్రమే అధిక ప్రాధాన్యం ఇస్తుందని, ప్రైవేట్ రంగంలో కూడా అనేక ఉపాధి అవకాశాలు ఉన్నాయని వివరించారు. ప్రైవేట్ విద్యాసంస్థలు నెలకొల్పి ఎంతో మంది యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించి వారి కుటుంబాలకు అండగా ఉంటున్నందుకు గర్వపడుతున్నానన్నారు. అంతకుముందు సదస్సుకు హాజరైన యువత బ్యాంకులు ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించి తమకు నచ్చిన రంగాల్లో రుణం పొందేందుకు పేర్లను నమోదు చేసుకున్నారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు నెలకొల్పేందుకు అధికారులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి, మూడు జిల్లాల అదనపు కలెక్టర్లు, కేంద్ర ప్రభుత్వరంగ సంస్థల ప్రతినిధులు, జాతీయ, రాష్ట్ర, జిల్లాల ఉన్నతాధికారులు, పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పోక్సోచట్టం, షీటీంపై అవగాహన..



మాట్లాడుతున్న అదనపు ఎస్పీ రామేశ్వర్

నాగర్‌కర్నూల్ క్రైం: విద్యార్థినులు, మహిళలు వేధింపులకు గురైతే ధైర్యంగా ముందుకొచ్చి షీటీంకు ఫిర్యాదు చేయాలని అదనపు ఎస్పీ రామేశ్వర్ సూచించారు. మంగళవారం పుర పరిధిలోని నాగనూలు కేజీబీవీలో పోక్సోచట్టం, షీటీంపై అవగాహన కార్యక్రమం నిర్వహించగా ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. షీటీంకు ఫిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచి ఆకతాయిల ఆట కట్టించి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. జిల్లా షీటీం ఇన్‌చార్జ్ విజయలక్ష్మి మాట్లాడుతూ.. సమాజంలో మహిళలు, బాలికలు తెలిసిన వారితోనే ఎక్కువగా వేధింపులకు గురవుతున్నారని, జాగ్రత్తగా ఉండాలే తప్పా అధైర్యపడొద్దని, వేధించే వారి వివరాలు పోలీసులకు తెలపాలని కోరారు. ప్రధాన కూడళ్లు, మండల, జిల్లాకేంద్రాల్లో షీటీం పని చేస్తుందని తెలిపారు. బాధితులు డయల్ 100, సెల్‌నంబర్ 87126 57676 ఫోన్‌చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. భరోసా కేంద్రం కో-ఆర్డినేటర్ శ్రీలత, కేజీబీవీ ఇన్‌చార్జ్ శశికళ పాల్గొన్నారు.

యువకుడికి జైలు శిక్ష

వివాహితను వేధింపులకు గురిచేసిన యువకుడికి వారం రోజుల జైలు శిక్ష విధిస్తూ రెండోతరగతి న్యాయమూర్తి తీర్పు వెలువరించినట్లు అదనపు ఎస్పీ రామేశ్వర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అచ్చంపేటకు చెందిన సాయిరాం నాగర్‌కర్నూల్ మండలానికి చెందిన ఓ వివాహితను వేర్వేరు నంబర్ల నుంచి ఫోన్‌చేసి కొద్దిరోజులుగా వేధిస్తుండటంతో ఆమె షీటీంను ఆశ్రయించింది. షీటీం ఏఎస్సై విజయలక్ష్మి, సభ్యుడు వెంకటయ్య నిందితుడు సాయిరాంను మంగళవారం అదుపులోకి తీసుకొని కోర్టులో హాజరుపర్చారు. విచారణ చేపట్టిన న్యాయమూర్తి నిందితుడికి వారం రోజుల జైలు శిక్ష విధించినట్లు తెలిపారు. సాయిరాంపై గతంలోనే ఈవ్‌టీజింగ్ కేసు నమోదైందని, ఎవరైనా మహిళలను వేధిస్తే సెల్‌నంబర్ 87126 57675 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని ఏఎస్పీ సూచించారు.

మెరుగైన ఆదాయం తీసుకురావాలి

- ఆర్టీసీ రీజినల్ మేనేజర్ శ్రీదేవి



ఆర్టీసీ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న ఆర్‌ఎం శ్రీదేవి

స్టేషన్ మహబూబ్‌నగర్: రానున్న దీపావళి, కార్తీక మాసంలో ఆర్టీసీ ఉద్యోగులు కష్టపడి పనిచేసి, రీజియన్‌కు మెరుగైన ఆదాయం తీసుకురావాలని రీజినల్ మేనేజర్ శ్రీదేవి అన్నారు. వివిధ డిపోల్లో పనిచేసే ఉద్యోగులకు ప్రగతిచక్రం 2024-25 సంవత్సరం రెండో త్రైమాసికం పురస్కారాల ప్రదానోత్సవాన్ని మంగళవారం స్థానిక రీజినల్ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించారు. మహబూబ్‌నగర్ రీజియన్‌లో రాఖీ దసరా పండగ సందర్భంగా జూలై, ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 10 మంది డ్రైవర్లు, ముగ్గురు టిమ్ డ్రైవర్లు, ఏడుగురు కండెక్టర్లు, ఒక ఎలక్ట్రీషియన్, ఒక మెకానిక్, ఒక శ్రామిక్, ఐదుగురు హైర్ బస్సు డ్రైవర్లకు ఆర్‌ఎం ప్రశంసాపత్రాలు, నగదు పురస్కారాలను అందజేశారు. అదేవిధంగా వనపర్తి బస్‌స్టేషన్‌ను ఉత్తమ బస్‌స్టేషన్‌గా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆర్‌ఎం మాట్లాడుతూ.. రీజియన్‌కు మంచి ఆదాయం తీసుకువచ్చి రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలపాలని ఉద్యోగులను కోరారు. దసరా పండగ సందర్భంగా ఉద్యోగులు సమష్టిగా ప్రయాణికులకు ఉత్తమ సేవలు అందించి, రాష్ట్రంలోనే అత్యధిక ఆదాయం తీసుకురావడం అభినందనీయమన్నారు. ఇదే స్ఫూర్తితో పనిచేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్‌ఎంలు లక్ష్మీధర్మ, శ్యామల, పలువురు డీఎంలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

లాజిస్టిక్ ఏజెంట్లకు అభినందన..

టీజీఎస్ ఆర్టీసీ లాజిస్టిక్ (కార్గో)లో ఉత్తమ సేవలు అందించిన ఏజెంట్లు పి.పృథ్వీరాజ్ (కర్నూల్ కౌంటర్), సి.సునీల్ (గద్వాల), ఎ.గౌతం (నాగర్‌కర్నూల్)కు ఆర్‌ఎం శ్రీదేవి మెమోంటోలు అందజేసి శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో లాజిస్టిక్ ఏటీఎం మహ్మద్ ఇసాక్, రీజినల్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ శ్రీధర్, జిల్లా సేల్స్ టీం ఇన్‌చార్జి పృథ్వీరాజ్ పాల్గొన్నారు.


ఆర్‌ఎన్‌ఆర్ ధాన్యం క్వింటా రూ. 2,059

దేవరకద్ర: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం ఆర్‌ఎన్‌ఆర్ ధాన్యం క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ. 2,059 ధర పలికింది. సీజన్ లేకపోవడంతో మార్కెట్‌కు కేవలం వంద బస్తాల ధాన్యం మాత్రమే అమ్మకానికి వచ్చింది. బుధవారం మార్కెట్‌లో ఉల్లి వేలం నిర్వహించనున్నారు.

మొక్కజొన్న క్వింటా రూ.2,471

జడ్చర్ల: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డుకు మంగళవారం వివిధ ప్రాంతాల నుంచి 4,759 క్వింటాళ్ల మొక్కజొన్న విక్రయానికి వచ్చింది. మొక్కజొన్న క్వింటాలుకు గరిష్ఠంగా రూ.2,471, కనిష్ఠంగా రూ.1,321 ధర లభించింది.

ఉమామహేశ్వర ఆలయ అభివృద్ధికి కృషి



అన్నదానానికి విరాళం అందజేస్తున్న దాతలు

అచ్చంపేట: ఉమామహేశ్వరం ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని ఆలయ కమిటీ అధ్యక్షుడు బీరం మాధవరెడ్డి తెలిపారు. మంగళవారం ఆలయ పాలకమండలి సమావేశం అనంతరం ఆయన మాట్లాడారు. భోగ మహేశ్వరంలో పంచలింగాలు, మండపం నిర్మాణం, బుకింగ్ కౌంటర్లు, ఆన్‌లైన్ విధానం అమలుకు పాలకమండలి తీర్మానం చేసిందని చెప్పారు. వివిధ మార్గాల్లో ప్రచార బోర్డుల ఏర్పాటు, అభివృద్ధి పనులపై చర్చ జరిగిందని వివరించారు. జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు అనురాధ, ఈఓ శ్రీనివాసరావు, అర్చకుడు వీరయ్య శాస్త్రి, సభ్యులు వాడకట్ల వినోద్, పవన్ పాల్గొన్నారు.

అమ్మవారికి ముక్కుపుడక బహూకరణ..

ఉమామహేశ్వరం ఆలయంలోని ఉమాదేవి అమ్మవారికి హైదరాబాద్ మౌలాలికి చెందిన ఆపరాశు వైష్ణవి రూ.12 వేల విలువైన ముక్కుపుడక బహూకరించారు. ఇదివరకు వచ్చినప్పుడు ముక్కుపుడక చేయిస్తానని మొక్కుకున్నామని.. మొక్కు తీర్చేందుకు వచ్చామని తెలిపారు. అలాగే ఆలయంలో జరుగుతున్న నిత్య అన్నదానానికి హైదరాబాద్‌లోని ముషీరాబాద్‌కు చెందిన గోరుగంటి అరుణ రాజకుమార్ రూ.25 వేల విరాళం అందజేశారు.

దర్శించుకున్న బాలబ్రహ్మస్వామి పీఠాధిపతులు..

బాలబ్రహ్మస్వామి పీఠాధిపతులు మంగళవారం ఉమామహేశ్వరస్వామి ఆలయాన్ని దర్శించుకొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

క్లుప్తంగా

లారీ, బైక్ ఢీ : వ్యక్తి దుర్మరణం

కృష్ణా: మండలంలోని రాష్ట్ర సరిహద్దులోగల చెక్‌పోస్టు ప్రాంతంలో మంగళవారం మధ్యాహ్నం ఆగిఉన్న లారీని బైక్ ఢీ కొని వ్యక్తి మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మాగనూర్ మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన మంగలి శేఖర్(36) ప్రతిరోజు శక్తినగర్‌లోని కంపెనీలో పని చేసేందుకు బైక్‌పై వెళ్తాడు. మంగళవారం కూడా అలాగే వెళ్తుండగా ఆగి ఉన్న లారీ ఢీకొట్టాడు. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అతనికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కృష్ణా ఎస్‌ఐ ఎండీ నవీద్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మక్తల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

గుడిసె దగ్ధం

గద్వాల క్రైం: ప్రమాదవశాత్తు గుడిసె దగ్ధమైన సంఘటన మంగళవారం పట్టణ శివారులో చోటు చేసుకుంది. బాధితుల కథనం మేరకు.. పిల్లిగుండ్ల కాలనీకి చెందిన బుడగ జంగాల జమ్ములమ్మ గుడిసెకు ప్రమాదవశాత్తు నిప్పు అంటుకుంది. గుర్తించిన స్థానికులు మంటలు ఆర్పేందుకు ప్రయత్నం చేయగా అప్పటికే గుడిసె పూర్తిగా కాలిపోయింది. ఈ ప్రమాదంలో ఇంట్లో ఉన్న వస్త్ర సామగ్రి, బియ్యం, వంట సామగ్రి దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో రూ. 90వేల నష్టం చోటు చేసుకుందని బాధితురాలు తెలిపారు.

ఇద్దరు పిల్లలతో సహా తల్లి అదృశ్యం

జడ్చర్ల: మండల పరిధిలోని కొత్త తండాకు చెందిన ముడావత్ శైలజ(28), పిల్లలు మనోజ్(8), మాన్విక్(7) అదృశ్యమయ్యారని ఎస్‌ఐ చంద్రమోహన్ తెలిపారు. సోమవారం శైలజ భర్త ముడావత్ విష్ణు సొంత పని నిమిత్తం హైదరాబాద్ వెళ్లి తిరిగి ఇంటికి వచ్చేసరికి ఇంట్లో ఎవరూ లేదని, తన భార్యకు ఫోన్ చేసిన ఎత్తడం లేదని.. మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చౌటుప్పల్‌లో యువకుడు..

చౌటుప్పల్ రూరల్: గొర్రెల కాపరి అదృశ్యమైన ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం ధర్మోజిగూడెం శివారులో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. నారాయణపేట జిల్లా మరికల్ మండలం ఎక్లాస్‌పూర్‌కు చెందిన బండారు ఆశప్ప తన కుమారుడు శ్రీకాంత్(18)తో పాటు మరో పది మందితో కలిసి పది రోజుల క్రితం ఎక్లాస్‌పూర్ నుంచి బయల్దేరారు. సోమవారం చౌటుప్పల్ మండలం ధర్మోజిగూడెం శివారులో బస చేశారు. అర్ధరాత్రి బహిర్భూమి కోసం వెళ్లిన శ్రీకాంత్ తిరిగి మంద వద్దకు రాలేదు. అతడి తండ్రి ఆశప్ప చౌటుప్పల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.

ఆర్‌పీ శ్రీలతపై కేసు నమోదు

మహబూబ్‌నగర్ క్రైం: కోయనగర్ మహిళ సంఘాల్లో జరిగిన భారీ కుంభకోణం వ్యవహారంలో ఆర్‌పీ శ్రీలతపై కేసు నమోదైంది. మహిళల పొదుపు ఖాతాల డబ్బు, స్త్రీనిధి, బ్యాంకు లింకేజీ ద్వారా మహిళా సంఘాల పేర్లపై రుణాలు పొంది ఆమె సొంతంగా వాడుకున్నట్లు అధికారుల విచారణలో తేలింది. దీంతో ఈ నెల 18న కోయనగర్‌కు చెందిన మహిళ సంఘాల సభ్యులు రూరల్ పోలీసులను ఆశ్రయించారు. కాగా.. మంగళవారం కోయనగర్‌కు చెందిన 30 సంఘాలకు సంబంధించిన రూ.1,49,36,205 డబ్బుల వ్యవహారంలో ఆర్‌పీ శ్రీలతపై మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. శ్రీలత ఆర్‌పీగా 2017 మార్చి నుంచి పని చేస్తోందని బ్యాంకు రుణాలకు సంబంధించి, శ్రీనిధి రుణాలతో పాటు ఇతర డబ్బులు సైతం అవకతవకలు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆమెపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్‌ఐ విజయ్‌కుమార్ వెల్లడించారు.

శిరోముండనం ఘటనలో.. లింగాల ఎస్‌ఐ వీఆర్‌కు అటాచ్

నాగర్‌కర్నూల్ క్రైం: లింగాల పోలీస్‌స్టేషన్‌లో ముగ్గురు యువకులకు శిరోముండనం చేయించడం.. అందులో ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన నేపథ్యంలో ఎస్‌ఐ జగన్‌ను వనపర్తి జిల్లా వీఆర్‌కు అటాచ్ చేస్తూ జోగుళాంబ జోన్ డీఐజీ ఎల్‌ఎస్ చౌహాన్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. లింగాల మండల కేంద్రానికి చెందిన ముగ్గురు యువకులు ఈ నెల 13న ఓ పెట్రోల్‌బంక్ నిర్వాహకులతో గొడవ పడ్డారు. సదరు పెట్రోల్‌బంక్ నిర్వాహకులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ముగ్గురు యువకులను స్టేషన్‌కు తరలించారు. ఈ క్రమంలో పోలీస్‌స్టేషన్‌లోనే యువకులు తల దువ్వుకోవడంతో ఆగ్రహించిన ఎస్‌ఐ జగన్.. ముగ్గురికి శిరోముండనం చేయించారు. శిరోముండనం చేయించడాన్ని తట్టుకోలేక పోయిన ఓ యువకుడు ఈ నెల 18న ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య యత్నించగా.. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలో ఎస్‌ఐ జగన్‌ను వనపర్తి జిల్లా వీఆర్‌కు అటాచ్ చేస్తూ జోగుళాంబ జోన్ డీఐజీ ఉత్తర్వులు జారీ చేశారు.

నిధుల దుర్వినియోగం?

పీయూ వీసీ భవనం చుట్టూ వివాదం



పీయూ వైస్‌చాన్స్‌లర్ భవనం

- రూ.లక్షల విలువైన సామగ్రి పక్కదారి పట్టినట్లు ఆరోపణల వెల్లువ
- సమగ్ర విచారణ జరిపించాలని విద్యార్థి సంఘాల డిమాండ్
- భవనాల బిల్లులపైనా విచారించాలని నూతన వీసీకి ఫిర్యాదు
- ఏ విచారణకైనా సిద్ధమన్న మాజీ వీసీ



వీసీ జీఎన్ శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేస్తున్న విద్యార్థి నాయకులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో నిధుల దుర్వినియోగంపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ భవనం పేరుపై కొనుగోలు చేసిన వస్తువులను పక్కదారి పట్టించి.. యూనివర్సిటీకి రూ. లక్షల్లో నష్టం కలిగించినట్లు ఆరోపిస్తూ మంగళవారం పలు విద్యార్థి సంఘాల నాయకులు నూతన వైస్ చాన్స్‌లర్ జీఎన్ శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేశారు. పీయూలో జరిగిన అక్రమాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి, దుర్వినియోగమైన డబ్బును రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం యూనివర్సిటీలో కొనసాగుతున్న పలు నిర్మాణాలకు సంబంధించి పనులు పూర్తి కాకుండానే బిల్లులను విడుదల చేసినట్లు ఆరోపించారు. ఆ బిల్లులను ఇవ్వడం వెనుకున్న ఆంతర్యమేమిటని వారు ప్రశ్నించారు. అంతే కాకుండా వీసీ భవనంలో పనిచేస్తున్న పలువురు సిబ్బందికి రెండు నుంచి మూడు వేతనాలు ఇస్తున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. వీసీ భవనంలో పనిచేస్తున్న ఓ సెక్యూరిటీ గార్డుకు ఏకంగా రూ.30 వేలకు పైగా వేతనం ఇస్తున్నట్లు తెలిసింది.

భారీగా ఆర్డర్లు..

పీయూలో వైస్ చాన్స్‌లర్ భవనానికి చాలా వరకు సామగ్రి ఉన్నప్పటికీ.. ఇంకా అవసరమని చెప్పి సోలార్ ప్యానెల్స్, వాటర్ ఫిల్టర్స్, పూలకుండీలు, కుర్చీలు, డైనింగ్ సామగ్రి, ఇతర ఫర్నిచర్‌తో పాటు కంప్యూటర్లు, ఏసీలు, ప్రాజెక్టర్లు ఇతర ఎలక్ట్రికల్ పరికరాలకు భారీగా ఆర్డర్లు ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ఆర్డర్ వచ్చిన తర్వాత వీసీ భవనంలో సామగ్రిని హ్యాండవర్ చేసే ప్రక్రియ పూర్తయిన తర్వాత కొద్దిపాటి సామగ్రిని ఇక్కడ దించి, మిగతా సామగ్రిని ఇతర ప్రాంతాల్లోకి తరలించినట్లు ఆరోపణలు ఉన్నాయి. పక్కదారి పట్టిన సామగ్రి విలువ రూ. లక్షల్లో ఉంటుందని అంచనా. వీటితో పాటు యూనివర్సిటీలో పెరుగుతున్న టేకు చెట్లను కొట్టించి, మాజీ వీసీ సొంత పనులకు వినియోగించినట్లు ఆరోపణలు లేకపోలేదు. పీయూలో చాలా టేకు చెట్లు కనిపించకుండా పోయాయని పలువురు పేర్కొంటున్నారు.

పట్టని అధికారులు..

యూనివర్సిటీ సామగ్రిని దారి మళ్లిస్తున్నట్లు మొదటి నుంచీ ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో తాజాగా విద్యార్థి సంఘాల నాయకులు కూడా ఫిర్యాదు చేయడం చర్చనీయాంశంగా మారింది. అడ్డగోలుగా పలు వస్తువులకు ఆర్డర్ పెట్టి, పక్కదారి పడుతుంటే వివిధ స్థాయిలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది ఎందుకు పట్టించుకోలేదన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. గత వీసీ పదవీ కాలంలో ఓ మహిళా రిజిస్ట్రార్ బాధ్యతలు నిర్వర్తించారు. గత ఫిబ్రవరిలో ప్రస్తుత రిజిస్ట్రార్ బాధ్యతలు చేపట్టారు. ఈ క్రమంలో తప్పిదాలకు తావిచ్చింది ఎవరనే ప్రశ్న యూనివర్సిటీ వర్గాల్లో చర్చకు దారి తీసింది.

అన్ని విషయాలు తెలుసుకుంటాం..



గత వీసీ బాధ్యతలు పూర్తయి సుమారు నాలుగు నెలలు అవుతుంది. తర్వాత ఓ ఐఏఎస్ ఇన్‌చార్జి వీసీగా బాధ్యతలు నిర్వర్తించారు. వారికి ఫిర్యాదు చేయకుండా, నేను వచ్చాక ఫిర్యాదులు చేస్తున్నారు. అధికారులతో చర్చించి అన్ని విషయాలు తెలుసుకుంటాం. తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకుంటాం.

– జీఎన్ శ్రీనివాస్, వీసీ, పీయూ

ఈసీ అనుమతితోనే పనులు..



నా మీద వచ్చిన ఆరోపణల్లో ఎటువంటి నిజం లేదు. ఈసీ అనుమతితోనే అన్ని పనులు చేపట్టాం. యూనివర్సిటీ అభివృద్ధి కోసం ఎంతో శ్రమించాం. గతం కంటే అభివృద్ధి చేశాం. ఆరోపణలకు సంబంధించి ఎలాంటి విచారణకైనా సిద్ధం. నిజమని తేలితే రాజీనామా చేస్తా.

– లక్ష్మీకాంత్ రాథోడ్, మాజీ వీసీ, పీయూ

రికార్డులను పరిశీలించాలి..



గత ఫిబ్రవరిలో రిజిస్ట్రార్‌గా బాధ్యతలు చేపట్టాను. అంతకుముందు ఏం జరిగిందనే అంశంపై పూర్తిస్థాయిలో రికార్డులను పరిశీలించాల్సి ఉంది. ఈ విషయంపై వీసీ జీఎన్ శ్రీనివాస్‌తో చర్చిస్తాం.

– మధుసూదనరెడ్డి, రిజిస్ట్రార్, పీయూ

సిట్టింగ్ జడ్జితో విచారించాలి..



పీయూలో జరిగిన అవినీతి, అక్రమాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి. ఏసీలు, కంప్యూటర్లు, వాటర్ ఫిల్టర్లు, సోలార్ ప్యానెల్స్ మొదలు అనేకం పక్కదారి పట్టాయని స్పష్టమైన ఆరోపణ చేస్తున్నాం. నిర్మాణంలో ఉన్న పనులు పూర్తి కాకముందే బిల్లులు ఎలా ఇస్తారు? వీసీ భవనంలో పనిచేసే సెక్యూరిటీ గార్డుకు ఏకంగా రూ. 30 వేలకు పైగా వేతనం ఇస్తున్నారు. ఏళ్లుగా పనిచేస్తున్న సిబ్బందికి రూ. 10 వేలు కూడా ఇవ్వని వారు ఇలా ఎలా ఇస్తారు.?

– రాము, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా నిర్మాణ బాధ్యులు

సమష్టి కృషితోనే సత్ఫలితాలు

- చేనేత ఉత్పత్తుల సొసైటీని సందర్శించిన అంతర్రాష్ట్ర బృందం
- చేనేత కార్మికుల ఐక్యతను ప్రశంసించిన ప్రతినిధులు



అమరచింత చేనేత ఉత్పత్తుల సొసైటీలో చీరల తయారీని పరిశీలిస్తున్న అంతర్రాష్ట్ర బృందం

అమరచింత: మగ్గాలపై జరీ చీరలను తయారు చేస్తూ చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు పడిన చేనేత కార్మికులు.. నేడు ఏకతాటిపైకి వచ్చి సొసైటీ ద్వారా వచ్చే లాభాలను పంచుకునే స్థాయికి ఎదగడం సంతోషంగా ఉందని కర్ణాటక నాబార్డు డీజీఎం సతీష్ కర్త అన్నారు. అమరచింత చేనేత ఉత్పత్తుల సొసైటీని మంగళవారం వెస్ట్ బెంగాల్, మధ్యప్రదేశ్, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన పలు ఎన్‌జీఓలు, నాబార్డు ప్రతినిధుల బృందం సందర్శించింది. మగ్గాలపై ఎలాంటి జరీ చీరలు నేస్తున్నారు.. నెలకు ఎన్ని చీరలు నేస్తారు.. వాటితో ఎంతమేర ఆదాయం వస్తుందనే విషయాలను చేనేత కార్మికులను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా చేనేత ఉత్పత్తుల సొసైటీ ద్వారా కొనసాగుతున్న కుట్టు పరిశ్రమలో ఉపాధి పొందుతున్న మహిళలతో మాట్లాడి ఆదాయంపై ఆరా తీశారు. అనంతరం చేనేత కార్మికులతో సమావేశమై సొసైటీ నిర్వహణ వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చేనేత ఉత్పత్తుల సంఘం సీఈఓ శేఖర్ మాట్లాడుతూ.. ఒకప్పుడు మగ్గాలపై చీరలు తయారు చేసి కూలీ తీసుకునే కార్మికులందరినీ ఏకతాటిపైకి తీసుకువచ్చి, సొసైటీలో భాగస్వాములను చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం సొసైటీలో వచ్చే లాభాలను ప్రతి ఒక్కరూ సమానంగా తీసుకుంటున్నారని వివరించారు. అనంతరం వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ఎన్‌జీఓలతో పాటు నాబార్డు, బర్డ్ సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ.. తమ రాష్ట్రాల్లో కూడా ఇటువంటి స్వయం ఉపాధిని కార్మికులకు అందించాలనే లక్ష్యంతో క్షేత్రస్థాయి పర్యటనకు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాబార్డు డీడీఎం హన్మేష్‌చారి, కర్ణాటక డీజీఎం సతీష్, బర్డ్ స్వచ్ఛంద సంస్థ, ఆత్మకూర్ డీసీసీబీ బ్యాంకు మేనేజర్ నబీ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలను సందర్శించిన ట్రెయినీ కలెక్టర్లు



మద్దెలబండ పెద్దతండాలో పాఠశాల వద్ద ట్రెయినీ కలెక్టర్లు

ధరూరు: మండలంలోని ఉప్పేరు గ్రామాన్ని మంగళవారం ట్రెయినీ ఐఏఎస్, ఐపీఎస్‌లు సందర్శించారు. గ్రామంలో ఉన్నత పాఠశాలను సందర్శించారు. ట్రెయినీ కలెక్టర్లు ఉత్తర ప్రదేశ్‌కు చెందిన మనోజ్‌కుమార్ యాదవ్, ఢిల్లీకి చెందిన సిమ్రాన్ భరద్వాజ్‌లతో పాటు రిషబ్ జైన్ ఐఎఫ్ఎస్, కేరళకు చెందిన ఆదర్శ్ ఐటీఎస్, జడ్చర్లకు చెందిన దివ్య ఐడీ ఏఏ ట్రైనీ అధికారులు ఉపాధ్యాయులతో మాట్లాడారు. పాఠశాల నిర్వహణ, విద్యా బోధన తదితర అంశాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి పాఠశాలలో వండిన మధ్యాహ్న భోజనం చేశారు. అంతకు ముందు ట్రెయినీ అధికారులను పాఠశాల విద్యార్థులు శాలువా, పూల మాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం గౌరీశంకర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పెద్దతండాలో.. ట్రెయినీ కలెక్టర్లు

మల్దకల్: మండలంలోని మద్దెలబండ పెద్దతండాలో ట్రెయినీ కలెక్టర్లు, ఎస్పీలు పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న విద్యతో పాటు మధ్యాహ్న భోజనం పరిశీలించారు. ఆరోగ్యం పట్ల తీసుకుంటున్న జాగ్రత్తలను సీడీపీఓ నాగరాణిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఐఏఎస్, ఐపీఎస్ శిక్షణ పొందుతున్న పాల్వాయి విష్ణువర్ధన్ రెడ్డి, వికాస్, ఆదాం మొయిద్దీన్, పుష్కర వరమ, హర్షిత్ కుమార్, అలావత్, ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి, ఎంపీఓ రాజశేఖర్, ఏఈఓ జోహన, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు ఉన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ధరూరు: మండలంలోని ఖమ్మంపాడు గ్రామ శివారులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు రేవులపల్లి పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళితే.. కృష్ణానది తీరంలో ఒడ్డున 45–50 ఏళ్ల మధ్య వయసు ఉన్న గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గ్రామస్తులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్‌ఐ మృతదేహాన్ని గద్వాల ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మూడు రోజుల క్రితం వ్యక్తి మృతి చెందినట్లుగా అనుమానం వ్యక్తం చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మహాలక్ష్మి డబ్బులు వేస్తామంటూ బురిడీ

- బ్యాంకు ఖాతాల్లో రూ. 1.63 లక్షలు మాయం చేసిన సైబర్ నేరగాళ్లు

జడ్చర్ల: సైబర్ నేరగాళ్లు రోజుకో కొత్త పంథాను ఎంచుకొని అమాయక ప్రజలను బురిడీ కొట్టిస్తున్నారు. తాజాగా మహాలక్ష్మి పొదుపు సంఘం డబ్బులు వేస్తామని నమ్మబలికి బ్యాంకు ఖాతాల్లోని సొమ్మును మాయం చేశారు. జడ్చర్ల మండలంలోని గంగాపూర్‌లో సోమవారం ఈ ఘటన చోటుచేసుకోగా.. మంగళవారం వెలుగులోకి వచ్చింది. బాధితుల వివరాల మేరకు.. గంగాపూర్‌కు చెందిన చెన్నకేశవులుకు గుర్తుతెలియని వ్యక్తి ఫోన్‌చేసి, మీ భార్యకు మహాలక్ష్మి గ్రూప్ లోన్ వచ్చింది.. బ్యాంకు ఖాతా వివరాలు చెప్పాలని కోరాడు. అయితే తన మిత్రుడు గోపాల్ అందుకు సంబంధించిన వివరాలు చెబుతాడని అతడి ఫోన్ నంబర్ ఇచ్చాడు. ఫోన్ నంబర్ తీసుకున్న అపరిచిత వ్యక్తి చెన్నకేశవులును లైన్‌లోనే ఉంచి, గోపాల్‌కు కాన్ఫరెన్స్ కాల్ కలిపాడు. ఈక్రమంలో చెన్నకేశవులు గోపాల్‌తో మాట్లాడి, మహాలక్ష్మి గ్రూప్ లోన్ డబ్బులు వేస్తారు.. నీ బ్యాంకు ఖాతా వివరాలు చెప్పాలని చెప్పాడు. అయితే ఇద్దరు పక్కపక్కనే ఉన్నారని నమ్మిన గోపాల్.. తన ఖాతా వివరాలను అపరిచిత వ్యక్తికి తెలియజేశారు. వెంటనే అపరిచిత వ్యక్తి పేమెంట్ పంపడంలో సమస్య వచ్చింది.. మరెవరిదైనా ఉంటే చెప్పాలని కోరడంతో తన బంధువైన భూత్పూర్‌కు చెందిన మల్లేష్‌కు ఫోన్ ఇచ్చి, ఖాతా వివరాలు చెప్పాలని గోపాల్ చెప్పారు. అపరిచిత వ్యక్తి సూచనల మేరకు తన ఫోన్ నుంచి స్కానర్‌ను వాట్సప్‌లో పోస్టు చేశాడు. దీంతో పే నౌ మెసేజ్ వచ్చింది. తాను ఆ మెసేజ్‌ను ఓకే చేసిన వెంటనే ఖాతా నుంచి రూ. 35వేలు కట్ అయినట్లు మెసేజ్ రావడంతో మల్లేష్ ఖంగుతిన్నాడు. వెంటనే గోపాల్‌కు విషయం చెప్పాడు. తన ఖాతాను కూడా సరిచూసుకోగా రూ. 1.28 లక్షలు మాయం అయినట్లు గుర్తించి లబోదిబోమన్నారు. ఇద్దరి ఖాతా నుంచి మొత్తం రూ. 1.63 లక్షలు స్వాహా అయ్యాయి. మంగళవారం జడ్చర్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గతంలో చెన్నకేశవులు తన ఖాతాకు ఇతరుల నుంచి డబ్బులు వేయించి, తీసుకునే వాడని.. ఈ క్రమంలోనే ఈ వ్యవహారాన్ని నమ్మాల్సి వచ్చిందని బాధితుడు గోపాల్ 'సాక్షి'కి వివరించారు.



జడ్చర్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వచ్చిన బాధితులు

తగ్గిన ఇన్‌ఫ్లో.. గేట్లు మూసివేత

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు వరద తగ్గుముఖం పట్టింది. మంగళవారం 64వేల క్యూసెక్కులకు ఇన్‌ఫ్లో పడిపోవడంతో ప్రాజెక్టు క్రస్టు గేట్లను మూసివేశారు. విద్యుదుత్పత్తి నిమిత్తం 37,480, నెట్టెంపాడుకు 750, ఆవిరి రూపంలో 47, ఎడమ కాల్వకు 1,140, కుడి కాల్వకు 720, ఆర్డీఎస్ లింక్ కెనాల్‌కు 50 క్యూసెక్కులతో కలిపి మొత్తం 64,815 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 8.969 టీఎంసీల నీరు ఉన్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు.

సుంకేసులలో 8 గేట్ల ఎత్తివేత..

రాజోళి: సుంకేసుల డ్యాంకు ఎగువ నుంచి 34,050 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండటంతో 8 గేట్లు తెరిచి 31,858 క్యూసెక్కులు దిగువకు వదిలినట్లు జేఈ మహేంద్ర తెలిపారు. కేసీ కెనాల్‌కు 2.095 క్యూసెక్కులు వదులుతున్నట్లు పేర్కొన్నారు.

శ్రీశైలం నుంచి 66,331 క్యూసెక్కులు దిగువకు..

దోమలపెంట: శ్రీశైలం ప్రాజెక్టుకు వరద తగ్గడంతో మంగళవారం రెండు గేట్లను 10 అడుగుల చొప్పున ఎత్తి 55,508 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. భూగర్భ జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో విద్యుదుత్పత్తి నిమిత్తం 35,315, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో విద్యుదుత్పత్తికి 31,016 క్యూసెక్కులతో కలిపి మొత్తం 66,331 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు విడుదలవుతున్నాయి. ప్రస్తుతం శ్రీశైలం జలాశయంలో 884.3 అడుగుల వద్ద 211.4759 టీఎంసీల నీటి నిల్వ ఉంది. 24 గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడుకు 13,583, ముచ్చుమర్రి, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్‌కు 1,520, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్‌ఐకి 1,464 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఎడమగట్టు విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో 16.607 మి.యూ. విద్యుదుత్పత్తి చేశారు. కుడిగట్టు కేంద్రంలో 15.412 మి.యూ. ఉత్పత్తి చేశారు.



శ్రీశైలం ప్రాజెక్టు రెండు గేట్ల నుంచి దిగువకు విడుదలవుతున్న వరద

లక్ష్యానికి చేరువలో విద్యుదుత్పత్తి

- 11 యూనిట్ల ద్వారా 435 మెగావాట్ల విద్యుదుత్పత్తి
- 36 వేల క్యూసెక్కుల నీటి వినియోగం
- ఈ ఏడాది టార్గెట్ 600 మి.యూ.
- ఇప్పటి వరకు 576.612 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి



దిగువ జూరాల విద్యుదుత్పత్తి కేంద్రం

ఆత్మకూర్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు దిగువ, ఎగువనున్న జల విద్యుదుత్పత్తి కేంద్రాల్లో వేగవంతంగా కొనసాగుతోందని జెన్‌కో సివిల్, ఎలక్ట్రికల్ ఎస్‌ఈలు సురేష్, సూరిబాబు తెలిపారు. ఈ ఏడాది ఎగువ, దిగువల్లో కలిపి 600 మి.యూనిట్ల టార్గెట్‌కు చేరువలో ఉన్నామన్నారు. జూరాలకు ఎగువ కర్ణాటక నుంచి అత్యధికంగా వరదనీరు వస్తుండడంతో నిర్విరామంగా ఉత్పత్తి చేపడుతున్నామన్నారు. ఎగువలో 300 ఎంయూకు గాను 297 ఎంయూ చేపట్టామని బుధవారం టార్గెట్‌కు రీచ్ అవుతోందని, దిగువలో 300 ఎంయూకుగాను 278 ఎంయూ ఉత్పత్తి చేశామని, మరో మూడు రోజుల్లో టార్గెట్‌రీచ్ అవుతామని ఆశాభావం వ్యక్తం చేశారు. బుధవారం 11 యూనిట్ల ద్వారా విద్యుదుత్పత్తిని చేపడుతున్నామని, ఎగువలో 5 యూనిట్ల ద్వారా 195 మెగావాట్లు, దిగువలో 6 యూనిట్ల ద్వారా 240 మెగావాట్లు విద్యుదుత్పత్తిని చేపడుతున్నామన్నారు. ఇప్పటివరకు 576.612 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తిని చేశామన్నారు.

సబ్‌జూనియర్ సాఫ్ట్‌బాల్‌లో ద్వితీయస్థానం



రన్నరప్‌గా నిలిచిన బాలికల జట్టుతో క్రీడా సంఘాల ప్రతినిధులు

మహబూబ్‌నగర్ క్రీడలు: వరంగల్‌లో ఈ నెల 18 నుంచి 19 వరకు జరిగిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాలికల సాఫ్ట్‌బాల్ పోటీల్లో జిల్లా జట్టు చక్కటి ప్రతిభ కనబరిచింది. నిజామాబాద్ జట్టుతో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో కేవలం ఒక పాయింట్ తేడాతో ఓడిపోయి రన్నరప్‌గా నిలిచింది. జిల్లాకు చెందిన పి.కాంచన బెస్ట్ పిచ్చర్‌గా బహుమతి అందుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా సాఫ్ట్‌బాల్ సంఘం ఆధ్వర్యంలో స్థానిక మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలో మంగళవారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో జిల్లా బాలికల జట్టును పలువురు అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం డీఎస్సీ 2024లో ఎస్జీటీగా ఎంపికైన క్రీడాకారుడు నందన్‌కుమార్‌ను సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా అథ్లెటిక్స్ సంఘం కార్యదర్శి జి.శరత్‌చంద్ర, సాదిక్‌అలీ, ఆనంద్, రాఘవేందర్, నాగరాజు, మేరిపుష్ప, కోచ్ కపిల్‌వర్మ, మోహన్, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

మద్దూరులో దొంగల హల్‌చల్

- ఆరున్నర తులాల బంగారం అపహరణ



వివరాలు నమోదు చేసుకుంటున్న పోలీసులు

మద్దూరు: మద్దూరు పట్టణంలో దొంగలు హల్‌చల్ చేశారు. మూసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకొని దోపిడికి పాల్పడిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. బాధితుల వివరాల ప్రకారం.. పట్టణంలోని సాయిమందిరం దగ్గర ఇంట్లో చింతల్‌దిన్నె గ్రామానికి చెందిన లత అద్దెకు ఉంటోంది. ఆమె ఓ ప్రైవేట్ పాఠశాలలో ఉద్యోగం చేస్తోంది. భర్త వేరే ఊళ్లో ఆర్‌ఎంపీగా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో ఆమె ఇంటికి తాళం వేసి ఉద్యోగానికి వెళ్లింది. ఈ క్రమంలో దొంగలు తాళం పగులగొట్టి ఇంట్లో బీరువాలో ఆరున్నర తులాల బంగారం అపహరించారు. ఇంటి కొచ్చిన ఆమె తాళం విరిగి, బీరువా తెరిచి ఉండడంతో నగలు చోరీ చేసినట్లు గుర్తించింది. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్‌ఐ రాంలాల్ అక్కడకు చేరుకొని ఇంట్లో పరిశీలించారు. మంగళవారం కోస్గి సీఐ దశ్రునాయక్ సంఘటనా స్థలానికి చేరుకొని క్లూస్ టీం, టవర్‌డం సిబ్బందిని పిలిపించి పరిశీలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. సోమవారం రాత్రి పశువుల ఆస్పత్రి దగ్గర కాలనీలో ఓ ఇంట్లో దొంగలు పడినట్లు కాలనీ వాసులు గుర్తించారు.

